క్లుప్తంగా

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అచ్చియ్యనాయుడు

మునగపాక: మండలంలోని మూలపేట గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి అవసరమయ్యే విరాళాలు విరివిగా అందుతున్నాయి.పలువురు భక్తులు అమ్మవారి ఆలయ నిర్మాణంలో భాగస్వాములతున్నారు. ఈ నెల 19న ఆలయ ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.5,116 నగదును శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు.

ఆకట్టుకున్న భక్త చింతామణి పద్య నాటకం



భక్త చింతామణి నాటకంలోని సన్నివేశం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం రాత్రి దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉత్సవంలో భాగంగా రాత్రికి తిమ్మరాజుపేటలో ప్రదర్శించిన భక్త చింతామణి పద్య నాటకం అందరినీ ఆకట్టుకుంది. నాటకాన్ని దివంగత కాళ్లకూరి నారాయణరావు రచన చేయగా బి.వి.ఎ. నాయుడు దర్శకత్వం వహించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ నగదు పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ నగదు అందజేస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలని రాంబిల్లి మండలం మామిడి వాడ కెనరా బ్యాంకు మేనేజర్ కిషోర్ అన్నారు. చదువులో ప్రతిభ చూపిన ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు శుక్రవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. 6 నుంచి 10 వ తరగతి వరకు ప్రతి తరగతిలో ఇద్దరికి రూ.5 వేల చొప్పున అందజేశారు. ప్రతి ఏడాది స్కాలర్‌షిప్ అందజేస్తామని కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు లలితాంబ,కుసుమ కుమారి, విజయ్ కుమారి, అరుణ, కృష్ణవేణి, విమల, కరుణ, అప్పలనాయుడు, జి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో నైపుణ్యాలకు పదును



క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులతో శివ

అనకాపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు, వారిలో నైపుణ్యాలను పెంచేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఐఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ డి.శివ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు అకాడమీ ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌పై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం చదువులో నిమగ్నమైన విద్యార్థులకు క్విజ్ పోటీలు ఆటవిడుపులా ఉపయోగపడతాయన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీఆర్ మూర్తి, కె.పవన్, ఎం.కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

తుమ్మపాల: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు వాజ్‌పేయి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, నాయకులు కర్రి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ లక్ష్మీ.. శిరసా నమామి

- భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు
- ఉపమాకలో గోదాదేవి అమ్మవారికి తిరువీధి సేవ



వరలక్ష్మీ వ్రతం కోసం సర్వాంగ సుందరంగా అలంకరించిన ప్రతిమ



ఉమ్మలాడలో దేవీతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



గోదాదేవి అమ్మవారు



ఉపమాకలో అమ్మవారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

నక్కపల్లి: సిరిసంపదలు, సకల శుభాలను ప్రసాదించే వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి, లక్ష్మణేశ్వరస్వామియంలో పార్వతీదేవికి ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్లమ్మవారికి ఉదయం ప్రత్యేక కుంకుమార్చనలు, లక్ష్మీ అష్టోత్తర శతనామార్చనతో పూజలు నిర్వహించారు. సాయంత్రం గోదాదేవి అమ్మవారిని రాజాధి రాజ వాహనంలోఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలతో సర్వాంగ సుందరంగా సర్వాభరణాలతో అలకంకరించారు. తిరువీధిసేవల్లో ప్రధానార్చకులు వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు శేషాచార్యులు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిని పూజా సామగ్రి ధరలు

పూజా సామగ్రి ధరలను వ్యాపారులు అమాంతంగా పెంచేశారు. కొబ్బరి కాయ రూ.30, అరటి పళ్ల డజను రూ.60, పువ్వులు కిలో రూ.360కు విక్రయించారు. వరలక్ష్మీవ్రతం రోజును కొత్త కోడళ్లు, కుమార్తెలతో శ్రావణ గౌరీ వ్రతాన్ని ఆచరించడంతో ఇళ్లన్నీ కళకళలాడాయి.

మునగపాక: శ్రావణమాసంలోని రెండవ శుక్రవారం సందర్భంగా మండల వ్యాప్తంగా వరలక్ష్మీ దేవి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మలాడలోని శ్రీ దేవితల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడు,కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

కోటవురట్ల: శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు.

ఎస్.రాయవరం: మండలంలో శ్రావణ శుక్రవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

భక్తులతో ఆలయాలు కిటకిట



జీసీటీ వీధిలో వరలక్ష్మీదేవి వ్రతం చేస్తున్న మహిళ



ఓ ఇంట్లో ప్రత్యేకంగా అలంకరించిన వరలక్ష్మీదేవి



ముత్తయిదువకు వాయినం ఇస్తున్న గృహిణి

యలమంచిలి రూరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణం,మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.పట్టణంలోని సంతోషి మాత,వాసవీ కన్యకాపరమేశ్వరి, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో వెళ్లి కుంకుమార్చనలు,పూజలు చేశారు.కృష్ణాపురంలో లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు,వ్రతాలు జరిగాయి.పులపర్తి,లక్కవరం,కృష్ణాపురం గ్రామాలనుంచి భక్తులు వేకువజామునుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు వచ్చారు.ఈ సందర్భంగా ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.వివిధ రకాల పూలు,పండ్లతో అమ్మవారిని అలంకరించారు.పిండి వంటలను నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ముత్తయిదువలకు వాయినాలు సమర్పిస్తే సిరిసంపదలతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.దీంతో పలువురు ముత్తైదువులకు చీర,జాకెట్టు,గాజులు, పసుపు,కుంకుమలతో వాయినాలు ఇచ్చారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనల వెల్లువ



బొత్సను అభినందిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు



బొత్సను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు

నక్కపల్లి: ఉమ్మడి విశాఖజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సీనియర్ నేత బొత్స సత్యనారాయణను పాయకరావుపేట నియోజకవర్గ నేతలు అభినందించారు.శుక్రవారం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో నాయకులు విశాఖలో బొత్సను కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ తగినంత మెజార్టీ లేనప్పటికీ ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడం కోసం కూటమి నాయకులు చాలా కుట్రలు చేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి తమ కు అనుకూలంగా ఓట్లు వేయించుకోవాలని ప్రయత్నించి భంగపడ్డారని చెప్పారు. బొత్సను అభినందించిన వారిలో అనకాపల్లి మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఎంపీటీసీలు బచ్చలరాజు, లొడగల చంద్రరావు,దేముళ్లు, నాయకులు ఎరిపల్లినాగేశు,నాగ అప్పలరాజు,కొర్లయ్య,సత్తిబాబు తదితరులున్నారు.

కోటవురట్ల: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. బొత్సను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు నారాయణమూర్తిరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా 144వ సెక్షన్ అమలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటు హక్కు కలిగిన తల్లిదండ్రులు మాత్రమే స్కూళ్ల వద్ద ఉండాలని, రాజకీయ పార్టీల నేతలు ఎవరూ గుంపులుగా ఉండరాదని ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

ప్రమాదకరంగా ఏలేరు కాలువపై వంతెన



శిథిలావస్థకు చేరిన వంతెన

నాతవరం: పెదగొలుగొండపేట సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఏలేరు కాలువపై కు నిర్మించిన వంతెన శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఏలేరు కాలువతోపాటు నిర్మించిన వంతెన క్రమేపి శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనిపై రెండు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా నాతవరం మండలంలో పది పంచాయతీల ప్రజలు కోటనందూరు, రవతలపూడి మండలాలకు చెందిన పలు గ్రామాల వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వంతెనకు నిర్మించిన రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. రాత్రిళ్లు కొత్తగా వచ్చే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఏలేరు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



విలేకర్లతో మాట్లాడుతున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కూల్చి వేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరాంపురంలో గురువారం రాత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నేలపై పడేశారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూల మాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ రైతుల పక్షపాతి, ఆరోగ్య శ్రీ ప్రదాత అయిన వైఎస్సార్ విగ్రహాన్ని ఇలా చేయడం అమానుషమన్నారు. మండలంలో గతంలో ఎన్నడూ విగ్రహాలను ధ్వంసం చేయడం జరుగలేదని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరగడం ఎంతో దారుణమన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి కూడా దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి యజ్జల సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, మాసాహేబుపేట, మంగవరం ,పాల్మన్‌పేట సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, వంగలపూడి సరస్వతీ రామారావు,గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమల రాజు నర్సింహరాజు, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, మాజీ ఎంపీటీసీ పి.భద్రరావు, నాయకులు పల్లేల కృష్ణార్జునరావు, పల్లేల వెంకట్, గుజ్జు గోవిందరెడ్డి, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతాభవానీ శ్రీనివాస్, తూమురమణ, నీలాపు చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



గురుకుల పాఠశాలలో నూతన కంప్యూటర్లను పరిశీలిస్తున్న నల్లాం శ్రీరామ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

అనకాపల్లి: కంప్యూటర్ల సాయంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా బోధనను విద్యార్థులకు అందించి, వారి నైపుణ్యాలకు మరింత పదును పెట్టవచ్చని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన నల్లాం శ్రీరామ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాఠశాల విద్యార్థులకు సౌకర్యార్థం శుక్రవారం 6 కంప్యూటర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.1.80 లక్షలు విలువ చేసే కంప్యూటర్లను అందించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వీటి సాయంతో తమ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య మరింత చేరవయిందన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రెండో దశలో మరో నాలుగు కంప్యూటర్లు అందజేయనున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో ఆర్గనైజర్లు మహేంద్ర పట్నాయక్, గోవింద్, రామరాజు, ప్రియాంక, కమల, రత్నం, నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిత్రునికి పూర్వ విద్యార్థుల సాయం



కంచిపాటి సతీష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థి మిత్రులు

కశింకోట: అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మిత్రుడికి పూర్వ విద్యార్థులు ఆసరాగా నిలిచారు. శుక్రవారం ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో 2001-02 బ్యాచ్ టెన్త్ విద్యార్థి కంచిపాటి సతీష్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న అదే బ్యాచ్ విద్యార్థులు రూ.45 వేలు సేకరించి, మిత్రునికి అందించారు. ధైర్యంగా ఉండాలని, ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామన్న భరోసానిచ్చారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి



యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల



యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన ఓటర్ల జాబితా

- నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు
- ఓటర్ల జాబితాలు విడుదల చేసిన హెచ్‌ఎంలు
- కమిటీలో సభ్యులకు రెండేళ్ల పదవీకాలం

యలమంచిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికల సందడి నెలకొంది. పాఠశాలల పర్యవేక్షణకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ(పీఎంసీ)ల స్థానంలో కూటమి ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)లుగా పేరు మార్చి ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది.రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల8న ఎన్నికలు జరగగా, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా జిల్లాలో ఎన్నికలను వాయిదా వేసి, రీషెడ్యూల్ చేశారు. దీని ప్రకారం శనివారం మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.ఇప్పటికే ఆయా స్కూళ్ల నోటీసు బోర్డుల్లో ఓటర్ల జాబితాలను ప్రధానోపాధ్యాయులు ప్రదర్శించారు. అభ్యంతరాల అనంతరం తుదు జాబితాల రూపకల్పన సైతం పూర్తి చేశారు.

ఎస్‌ఎంసీ కమిటీ సభ్యుల ఎన్నిక ఇలా..

ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం శనివారం అన్ని పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్,వైస్ చైర్మన్‌లను ఎంపిక చేయాలి.మధ్యాహ్నం 2 గంటలకు ఎంపికైన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించాలి.అనంతరం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు మొదటి ఎస్‌ఎంసీ సమావేశాన్ని నిర్వహించాలి.ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలి.ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.కమిటీల ఎన్నికలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్వహించాలి. కమిటీ ఏర్పాటుకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు,సంరక్షకులు హాజరు కావాలి.చేతులెత్తే విధానం,నోటి మాట ద్వారా ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్,వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరుగుతుంది.ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరించవచ్చు.ఎస్‌ఎంసీకి ఎన్నికైన సభ్యుల నుంచి చైర్మన్,వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఉంటుంది.వీరిలో ఒకరు వెనుకబడిన తరగతుల నుంచి ఉండాలి.వారిలో కనీసం ఒకరైనా మహిళ ఉండాలి.

మండలంలో 3,911 మంది విద్యార్థులు

యలమంచిలి మండలంలో ప్రాథమిక పాఠశాలలు 37,పాథమికోన్నత పాఠశాలలు 3,ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి.మొత్తం 3,911 మంది విద్యార్థులు ఉన్నారు.అంటే 3,911 మంది తల్లిదండ్రులు శనివారం జరగనున్న ఎస్‌ఎంసీ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్నట్టు లెక్క. తల్లి,తండ్రి,సంరక్షునికి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఇస్తారు.అయితే వీరిలో ఒకరికే ఓటు హక్కు ఉంటుంది. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పారదర్శకంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



యలమంచిలి మండలంతోపాటు డివిజన్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఈ నెల 17వ తేదీ శనివారం సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నాం.ఇప్పటికే ఆయా గ్రామాల్లో స్కూళ్లలో నోటీసు బోర్డుల్లో ఓటరు జాబితాలు ప్రదర్శించాం.విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నిబంధనల మేరకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం.

–అప్పారావు,
ఉపవిద్యాశాఖాధికారి, యలమంచిలి

ఉత్తమ సేవలకు ప్రశంస



ఉత్తమ సేవలందించినందుకు గాను స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ వై.పోలిరెడ్డి - యలమంచిలి రూరల్